

# పది పరీక్షల మూల్యాంకనం షురూ


**మూడు విడతల్లో 10 మూల్యాంకనం**

**విధిగా మూల్యాంకనం విధులకు హాజరవ్వాలి**

**డీఈవో రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నేటి నుంచి పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఈ సంవత్సరం మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు, ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు 23 రోజుల పాటు 1,72,190 ప్రశ్న పత్రాలను మూల్యాంకనం నిర్వహించ నున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ తెలిపారు.జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూలులో ప్రశ్నా పత్రాలను మూల్యాంకనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు ఎక్కువ రోజులు జరుగుతున్నాయని, పదో తరగతి పరీక్షలను 34 రోజులపాటు

మిగతా 2లో..

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

బుధవారం । 1 । ఏప్రిల్ । 2026




# లాభాల బాటలో ఆర్టీసీ

**290 కోట్ల మందికి పది వేల కోట్ల ఆదా**

**మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**

**మక్తల్, అక్షిత ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామని,విజయవంతంగా కొనసాగుతోందని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మహాలక్ష్మి పథకం విజయవంతమైనందుకు మక్తల్ బస్టాండ్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, అడిషనల్ కలెక్టర్ శ్రీను, రెవెన్యూ కలెక్టర్ ఫణిందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మానస హాజరైయ్యారు. ఇంతకు ముందు మక్తల్ పట్టణానికి కలెక్టర్ ప్రతీక్ జైన్ కు మంత్రి శాలువాతో సన్మానించారు. విజయవంతమైన మహాలక్ష్మి పథకానికి ఆర్టీసీ అధికారులు ప్రజల్లోకి తీసుకువెళ్లేలా చొరవ చూపడం లేదని ప్రస్తుతం ఏర్పాటు చేసిన వేదికను చూస్తేనే మహాలక్ష్మి పథకంపై ఆర్టీసీ అధికారులకు ఉన్న నిర్లక్ష్యం బయటపడుతుందని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మహిళలు తలెత్తుకొని తిరగడానికి గాను ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టి, వారు ప్రయాణించిన దూరానికి ప్రభుత్వమే

ఆర్టీసీకి డబ్బులు చెల్లిస్తున్న విషయాన్ని ఆర్టీసీ అధికారులు ఎందుకు ప్రచారం చేయడం లేదని ఆయన డిపో మేనేజర్ ని ప్రశ్నించారు. ఆర్టీసీ లాభాల బాటలో కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఆది నాయకురాలు సోనియమ్మ పుట్టినరోజు దినాన రాష్ట్ర వ్యాప్తంగా నేటికీ మహాలక్ష్మి పథకం ద్వారా 290 కోట్ల మంది మహిళలు బస్సులో ప్రయాణించి పదివేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్టీసీకి అందించిందని నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రయాణిస్తున్న మహిళల నుండి రోజు "12 లక్షల ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుండి తీసుకుంటుందని ఆర్టీసీ లాభాల బాటలో కొనసాగుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకొని విజయవంతంగా అమలు చేస్తు ఆర్టీసీకి లాభాలు సమకూరుస్తున్న ప్రచారంలో వెనుకబడి ఉందని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాలలో మహిళలను భాగస్వామ్యం చేయడం వల్లనే ఆర్థిక వ్యవహారాలన్నీ వారి చేతుల నుండి ఖర్చు చేయడంతోనే ఆ కుటుంబం బాగుపడుతుందని మారుమూల గ్రామాల నుండి పట్టణాలకు చదువుకోడానికి ఉద్యోగరీత్యా వచ్చే విద్యార్థులకు, ప్రయాణికులకు

మిగతా 2లో..



# అధ్యాత్మిక కేంద్రంగా బాసర క్షేత్రం

**6న సీఎం రేవంత్ రాక**

**పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**

**గోదావరి పుష్కరాలకు ముందస్తు చర్యలు**

**దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు**

**నిర్మల్, అక్షిత బ్యూరో:** బాసర సరస్వతి దేవాలయాన్ని రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. ఏప్రిల్ 6న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బాసర పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్

మిగతా 2లో..

# ఎస్సీ,ఎస్టీలపై వివక్షత ప్రదర్శించొద్దు

- **కలెక్టర్ చంద్రశేఖర్**

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్:** షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి సమస్యల పరిష్కారానికి ఎస్ సి,ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎస్ సి ,ఎస్ టి అట్రాసిటీ కేసుల జిల్లా స్థాయి విజిలెన్స్ ,మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ సి, ఎస్ టి లపై దాడులతో పాటు, అస్పృశ్యత నివారణకు కేంద్ర ప్రభుత్వం 1989 లోనే చట్టం తీసుకువచ్చిందని, అనంతరం దానికి కొనసాగింపుగా వివిధ రకాల చట్టాలను చేస్తూ ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన ఆకృత్యాల కేసుల సమీక్ష, నివారణకు జిల్లా స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, నూతనంగా ఎంపికైన ఎస్సీ, ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

మిగతా 2లో..








# దుండిగల్‌లో దోమల మోత!

- **శానిటేషన్ విభాగం ఉన్నట్టా లేనట్టా..?**
- **నిర్లక్ష్యపు నిద్ర మత్తులో దుండిగల్ సర్కిల్ అధికారులు**
- **విపరీతంగా దోమలు పట్టించుకుని అధికారులు**
- **దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్లో 28 ఫాగింగ్ మిషన్లు**
- **పని చేసేది మిషిన్ ఒక్కటే**
- **ఫాగింగ్ ఒక్క మిషన్‌తో జరిగేది సాధ్యమేనా.?**

**మేడ్చల్, అక్షిత బ్యూరో:** దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ లో విపరీతంగా దోమల బెడద మూడు డివిజన్లో దోమల బెడద ఉందంటూ ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు. దోమ కాటుతో వచ్చే విష జ్వరాలు ద్వారా మలేరియా టైఫాయిడ్ ఇలాంటి వ్యాధులతో హాస్పిటల్ పాలవుతున్న కూడా అధికారులు నిర్లక్ష్యపు ధోరణిలో పని చేస్తున్నారా ? అంటూ లేక సిబ్బంది వైఫల్యం అంటూ ప్రజలు నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. దుండిగల్ సర్కిల్ లో మూడు డివిజన్లో ఫాగింగ్ ఒకే మిషన్ తో సాధ్యమేనా ఏ గ్రామంలో అయినా పూర్తిస్థాయిలో ఫాకింగ్ చేయడం లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు.. దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ బౌరంపేట్ సింహపురి కాలనీలో విపరీతంగా దోమల బెడదతో పిల్లలకు విశ్వ జ్వరాలు మలేరియా ఇలాంటి వ్యాధులు

మిగతా 2లో..

# పది పరీక్షల మూల్యాంకనం షురూ

మొదటి పేజీ తరువాయి..

పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగానే పదవ తరగతి పరీక్షల ప్రశ్నపత్రాల మూల్యాంకనం మూడు విడతలుగా నిర్వహిస్తున్నట్లు, నేటి నుంచి మొదటి విడత ఏప్రిల్ 1వ తేదీ నుంచి తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితశాస్త్రంతో మూల్యాంకనం ఏప్రిల్ 9వ తేదీ వరకు జరగనున్నట్లు డిఇఓ తెలిపారు. రెండో విడతలో ఏప్రిల్ 10 నుంచి 17వ తేదీ వరకు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టుల మూల్యాంకనం నిర్వహించ నున్నట్లు, చివరగా మూడో విడతలో ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు సాంఘిక శాస్త్రం ప్రశ్నపత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు డిఇఓ తెలిపారు. ఇందుకోసం 92 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 554 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 162 మంది స్పెషల్ అసిస్టెంట్లను మూల్యాంకనానికి నియమించినట్లు డీఈవో తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు ఇద్దరి చొప్పున 16 మంది ప్రత్యేక అధికారులుగా క్యాంప్ ఆఫీసర్ గా డీఈఓ రమేష్ కుమార్, అదనపు క్యాంప్ ఆఫీసర్ గా కురుమయ్య, ఎగ్జామినర్ రాజశేఖర్ రావులు మూల్యశీకన కేంద్రానికి వ్యవహరించ నున్నారు. మూల్యాంకనం జరిగే లిటిల్ ఫ్లవర్ స్కూల్లో బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేసినట్లు డీఈవో తెలిపారు. మూల్యాంకనం ప్రక్రియ సజావుగా జరిగేలా, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రోజుకు 40 పేపర్లు మూల్యాంకనం ప్రతి సబ్జెక్ట్ ఉపాధ్యాయుడికి రోజుకు మూల్యాం కనం చేసేందుకు 40 పేపర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మూల్యాంకనం చేయడానికి ఆర్డర్లు అందుకున్న ప్రతి ఉపాధ్యాయుడు విధిగా హాజరు కావాలని, అనధికారికంగా మూల్యాం కనం విధులకు హాజరు కాకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డిఇఓ హెచ్చరించారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించినట్లు తెలిపారు.

# ఎస్సీ,ఎస్టీలపై వివక్షత ప్రదర్శించొద్దు

మొదటి పేజీ తరువాయి..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై ఆకృత్యాల నివారణకు కృషి చేయాలని, అలాగే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎవరైనా ఎస్సీ, ఎస్టీల పై దాడులు చేస్తే ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదవుతాయో, చట్ట ప్రకారం నమోదు చేసే కేసుల వివరాలు, అలాగే దాడులలో నష్టపోయిన వారికి చెల్లించే నష్టపరిహారం, కేసుల సమీక్ష, తదిత అంశాలన్నింటిని కూలంకషంగా సభ్యులకు వివరించారు. అధికారులతో పాటు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్సీ,ఎస్టీలపై దాడుల నివారణతో పాటు, చట్టాలు, అంటరానితనం, నిర్మూలనపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే గ్రామాలలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి వారికి సత్వర న్యాయం చేకూర్చే విధంగా జిల్లా యంత్రాంగం దృష్టికి సమస్యలను తీసుకురావాలని కోరారు. నూతనంగా ఎన్నికైన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని అయన తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ చట్ట ప్రకారం ఎవరిపైనా వివక్షత అన్నది చూపించకూడదని, అలా వివక్షత చూపించిన వారిపై కేసులు నమోదవుతాయని, ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీలపై దాడులను నివారించేందుకు గాను ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు తమ దృష్టికి వచ్చిన వెంటనే కేసులు నమోదు చేస్తున్నామని, 60 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లపై దాడుల కేసుల విషయంలో సాక్షాలు, ఆధారాల బలంగా ఉన్నచోట దాడులకు పాల్పడ్డ వారిపై శిక్షలు పడిన సందర్భాలు చాలా ఉన్నట్లు వెల్లడించారు. ప్రతినెల చివరి పని దినం రోజున పౌరహక్కుల దినాన్ని నిర్వహించి ఎస్సీ, ఎస్టీలపై దాడుల నివారణ, అంటరానితనం నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా ఎస్సీ ,ఎస్టీలపై దాడులు దాడులు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ముఖ్యంగా దేవాలయ ప్రవేశం లేకపోవడం, దేవదాసి వ్యవస్థ, అంటరానితనం లాంటి సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే తగిన విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నూతనంగా ఎంపికైన సభ్యులు బెజ్జం సైదులు, మల్లేష్ కుమార్, అనిత కుమారి, శ్రీనివాస్, భాస్కర్ నాయక్, భీరంపల్లి సైదులు, ధనలక్ష్మి లు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కేసుల విషయంలో సత్వర న్యాయం జరిగేలా చూడాలని, సమాజంలో ఇంకా అక్కడక్కడ ఎస్సీల పట్ల చిన్నచూపు చూస్తున్నారని, ఎస్సీల సమస్యలను పట్టించుకోవాలని, అలాగే ఎస్సీ ,ఎస్టీ దాడుల కేసులలో తక్షణమే చర్యలు తీసుకునేలా చూడాలని, గ్రామాలలో కొన్ని కేసులు పోలీస్ స్టేషన్ వరకు కూడా రానివ్వకుండా చూస్తున్నారని, ప్రభుత్వం తరఫున ఎస్సీ, ఎస్టీలలో భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో ఈ విషయాల పట్ల తెలియని వారికి అవగాహన కల్పించాలని ,ఎస్సీ ,ఎస్టీల పై దాడులు జరగకుండా చూడాలని ,ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రహదారులు, మురికి కాల్వలు సరిగా లేవని, ఎస్సీ కుటుంబాలకు ఇప్పటికీ సరైన టాయిలెట్ సౌకర్యం లేవని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శశికళ, ఆర్డీవోలు ,డిఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# లాభాల బాటలో ఆర్టీసీ

మొదటి పేజీ తరువాయి..

అనుకూలంగా ఉండేలా బస్సులు తిప్పాలని అన్నారు. రాత్రి సమయంలో తను దిగాల్సిన పల్లే స్టేజీల దగ్గర ఎక్స్ ప్రెస్ బస్సులను ఆపి ప్రయాణికులకు,ప్రజలకు సౌకర్యం కల్పించాలని,ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడమే తమ విధి అన్న లక్ష్యాన్ని ఆర్టీసీ అధికారులు గౌరవించి అమలు చేయాలని ఆయన అన్నారు. త్వరలో 4 కోట్లతో కొత్త బస్టాండ్ నిర్మిస్తా మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ పట్టణ కేంద్రంలో బస్టాండ్ ప్రయాణికుల రాకపోకల రద్దీ పెరిగి ప్రస్తుతం ఇరుకుగా మారి ఇబ్బందలు తొలగించేందుకు నాలుగు కోట్లతో విశాలంగా నూతన బస్టాండ్ నిర్మిస్తానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో జాతీయ రహదారి పక్కన దాదాపు 40 సంవత్సరాల కింద నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు చేరిందని ప్రస్తుతం జనాభా పెరిగి బస్సులో ప్రయాణికుల రాకపోకలు పెరిగి స్థలం సరిపోక శిథిలావస్థలో ఉందని తెలిపారు.



మక్తల్ బస్టాండ్‌కు సంబంధించిన రెవెన్యూ రికార్డును కలెక్టర్ తనకి ఇస్తే త్వరలోనే విశాలమైన బస్టాండ్‌కు ప్లాట్ ఫామ్, ప్రయాణికుల సౌకర్య వసతులతో కూడిన బస్టాండ్ నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా సంఘాల అక్కా చెల్లెళ్లు మొదలగువారు పాల్గొన్నారు.

# అధ్యాత్మిక కేంద్రంగా బాసర క్షేత్రం

మొదటి పేజీ తరువాయి..

అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన ఏర్పాట్లను సమీక్షించారు. ముందుగా ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనుల స్థలాలను పరిశీలించిన కమిషనర్, అనంతరం శంకుస్థాపనలు జరిగే ప్రదేశాలను సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జరిగే కార్యక్రమాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. తదుపరి దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి దర్శనంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అధికారులంతా సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నామని, పుష్కర ఘాట్ల మరమ్మత్తులు, కొత్త ఘాట్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో మౌలిక సదుపాయాల అభివృద్ధి



పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. వివిధ శాఖల అధికారులకు బాధ్యతలను కేటాయించి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయ వంతం చేస్తామని పేర్కొన్నారు. పుష్కరాల సందర్భంగా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# దుండిగల్‌లో దోమల మోత!

మొదటి పేజీ తరువాయి..

వ్యాపించే అవకాశాలున్నాయి. అనేకసార్లు శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం గమనార్హం ఇంటి టాక్స్‌ల గురించి అయితే ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు గాని ప్రజా సమస్యలు పట్టించుకోరా అంటూ విమర్శిస్తున్నారు సింహపురి కాలనీవాసులు. శానిటేషన్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో సర్కిల్




కార్యాలయంలోని ఇన్వార్డులో వినతిపత్రం అందజేశారు.దోమల బెడద పైన..ఇప్పటికైనా డిప్యూటీ కమిషనర్ చొరవ తీసుకొని దోమల బెడద లేకుండా పాగింగ్ చేపియాలని సింహపురి కాలనీ ప్రజలు కోరుతున్నారు..సింహపురి కాలనీ ది బ్లాక్ రెసిడెంట్స్ అసోసియేషన్. వాసులు.. ఆంజనేయులు, ఖదీర్, నాగరాజు, సతీష్ బాబు, దత్తాత్రి శేఖర్, భాను ప్రతాప్, రమణ, తిరుమలేష్, బాబురావు అండ్ ది బ్లాక్ కాలనీవాసులు తదితరులు కోరారు.

# జీవో 60ను రద్దుచేసి లారీ యజమానులను కాపాడండి

**రేడియం స్టిక్కర్ల నిలువు దోపిడీని అరికట్టండి.**

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రామినేని శ్రీనివాసరావు వినతి.**

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** లారీ యజమానులను కాపాడాలంటూ, రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వివాదాస్పద జీవో నెంబర్ 60ను తక్షణమే రద్దు చేయాలని ఆయన మంత్రిని



కోరారు. ముఖ్యంగా రేడియం స్టిక్కర్ల పేరిట లారీ యజమానులను నిలువుదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వెయ్యి రూపాయలు విలువ చేసే రేడియం స్టిక్కర్లకు ప్రభుత్వం ఏజెన్సీల పేరిట ఆరు వేల వరకు వసూలు చేయడం అన్యాయమని, ఈ విధా నాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు.

రేడియం స్టిక్కర్లను యజమానులే స్వయంగా వేసుకునేలా అనుమతించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రోడ్లపైకి వచ్చి ప్రత్యక్ష ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

# కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి

### ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై బంధువుల నిరసన

**వరంగల్, అక్షిత బ్యూరో:** గ్రేటర్ వరంగల్ ఎన్పీడీసీఎల్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. హనుమకొండ యాదవ నగర్ యూనిట్‌లో క్యాజువల్ కట్టర్‌గా పనిచేస్తున్న గాదె పున్నం చంద్ర కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాల ప్రకారం, సోమవారం హనుమకొండ గుండ్లసింగారం బీసీ కాలనీ వద్ద మరమ్మతుల పనులు నిర్వహిస్తుండగా, విద్యుత్ సరఫరా కొనసాగుతుండగానే పున్నం చంద్రను పోల్ ఎక్కించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కరెంట్ షాక్ తగలడంతో అతను కిందపడిపోయి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.




అతడిని వెంటనే నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ ముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తక్షణ పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

# ఆవుల పోతురాజు పుస్తకానికి జాతీయ స్థాయి పురస్కారం

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**

'నాన్నేనాహీరో''కథలపుస్తకాన్ని రాసి బాల సాహిత్యకారునిగా పలువురి ప్రశంసలు పొందిన సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈ సమాచారాన్ని తెలుగు సాహితీ వనం నిర్వాహకులు శాంతికృష్ణ ద్వారా తమకు సమాచారం అందినట్లు గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు






రామకృష్ణ, మధుసూదన రాజు మంగళవారం పత్రికలకుతెలియచేసారు. ఎం.ఎల్.ఎస్. స్నిగ్ధారెడ్డి బాలసాహిత్య పురస్కారం-2026 కొరకు ఆ సంస్థ బాల సాహిత్య పుస్తకాలను ఆహ్వానించగా మొత్తం 95 పుస్తకాలు పరశీలన నిమిత్తం ఆ సంస్థకు అందాయి.వాటిలో రెండు పుస్తకాలు మాత్రమే రాష్ట్ర స్థాయి బహుమతికిఎంపికయ్యాయి.ప్రముఖ బాల సాహిత్య కారులు వడ్డేపల్లి వెంకటేష్ రాసిన పిల్లల జాబిల్లి కథల పుస్తకం ఒకటి కాగా సత్తుపల్లి విద్యార్థి ఆవుల పోతురాజు రాసిన నాన్నే నాహీరో రెండవ పుస్తకంగా ప్రోత్సాహక బహుమతికి ఎంపికఅయింది.జులై నెలలో హైదరాబాదులో జరిగే కార్యక్రమంలో పోతురాజు ఈ పురస్కారం అందుకోనున్నారు. సత్తుపల్లి విద్యార్థి పోతురాజు రచనకు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించడం పట్ల సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ హర్షం వ్యక్తం చేసారు.పోతురాజుకు దక్కిన ఈ బహుమతి సత్తుమండలానికి దక్కిన గౌరంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్.రాజేశ్వరరావు, సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే.సోందు, తెలుగుఉపాధ్యాయిని రమాదేవి అభినందనలు తెలియచేసారు.ప్రస్తుతం పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న ఆవుల పోతురాజు మాట్లాడుతూ తనకు ప్రోత్సాహక బహమతి లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో చదువుతో పాటు రచనా వ్యాసంగాన్ని కూడా కొనసాగిస్తానని తెలిపారు.

# ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

### - పాఠశాలలో అదనపు గదుల ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

**గద్వాల,అక్షిత న్యూస్:** గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు 27 లక్షల వ్యయంతో నిర్మాణం అయిన అదనపు గదులను ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేబండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.

పాఠశాల ప్రిన్సిపల్ ఎమ్మెల్యే కి ఘనంగా స్వాగతం పలికారు.



ఎమ్మెల్యే చేతుల మీదుగా అద నపు గదులను, నూతన ప్రధాన గేటును రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ..గద్వాల ప్రాంతంలో బాలికల ఉన్నంత పాఠశాల 40 సంవత్సరాలు పైగా కావడం జరిగింది . ఈ పాఠశాలలోని ఎంతో మంది విద్యార్థులు చదువుకోవడం జరిగింది ప్రస్తుతం వారు వివిధ ప్రభుత్వ రంగాలలో ప్రవేట్ రంగాలలో అత్యంత స్థాయిలో ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గద్వాలలోని ఏకైక ప్రభుత్వ బాలికల ఉన్నంత పాఠశాల అన్నది ప్రతి ఒక్క విద్యార్థిని మంచిగా చదువుకొని భవిష్యత్తులో అత్యంత స్థాయికి ఎదగాలి అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు దూరం ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవసరం లేకుండా గద్వాల లోనే అన్ని రకాల విద్య అవకాశాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో సరైన విద్య లేక వెనుకబడిన ప్రాంతంగా పిలవబడేది కానీ నేడు నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి విద్యాపై ప్రత్యేక పెట్టడం జరిగింది ఇటీవలే మెడికల్ లో ఎంబిబిఎస్ సీట్లను ఎనిమిది మంది విద్యార్థులు సాధించడం జరిగింది గద్వాల ప్రాంతం నుండి అదేవిధంగా వివిధ రకాల పోలీస్ టీచర్స్ గవర్నమెంట్ ఎంప్లా యిల లో కూడా విద్యార్థులు ఉద్యోగా లను సాధించడం జరుగుతుంది. గతంలో పోల్చుకుంటే గతం కన్నా ఎప్పుడు విద్యారంగంలో కూడా శాతం పెరగడం జరిగిందని. అదేవి ధంగా విద్యార్థిని విద్యార్థులకు నర్సింగ్ కాలేజీ మెడికల్ కాలేజ్ పారామెడికల్ కాలేజీ కూడా గద్వాల ప్రాంతానికి రావడం జరిగింది ఇప్పటికే ఈ ప్రాంతంలో నర్సింగ్ కాలేజీ మూడు సంవత్స రాలు పూర్తి చేసుకోవడం జరు గుతుంది. పీజీ డిగ్రీ మహిళా డిగ్రీ కాలేజీ గురుకుల కాలేజీ కూడా రావడం జరిగింది అని తెలిపారు.

త్వరలోనే గద్వాల నియోజ కవర్గంలోని కే.టి దొడ్డి మండ లంలో సైనిక్ గురుకుల పాఠశాలను మంజూరు కావడం జరిగింది త్వరలోనే భూమి పూజ చేసి పాఠశాలను పనులను ప్రారంభించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవి ధంగా కాకులారంలో కూడా ప్రభు త్వ పాఠశాలను త్వరలో భూమి పూజ చేసుకోవడం జరుగుతుంది నవోదయ కూడా మంజూరు. కావడం జరిగింది భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుం డా విద్యకు సంబంధించిన అన్ని రకాల కోర్సులు విద్యాపరమైన వాటిని ఏర్పాటు చేయడం జరు గుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకోవాలని తెలిపారు.

విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించిన మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.ప్రతి ఒక్క విద్యార్థికి అడ్వాన్స్ ఆల్ ది బెస్ట్..పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్ నాగులు యాదవ్ రామ లింగేశ్వర కాంబ్లే చంద్రశేఖర్, సులోచనమ్మ, జిల్లా విద్యాధికారి, నాయకులు సాయి శ్యాం రెడ్డి, బంగి సుదర్శన్, వెంకటేశ్వర్ రెడ్డి, ఇలియాస్, ముత్యాల రవి, గోవిందు, రంగారెడ్డి, కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు , కాంట్రాక్టర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాలల చట్టాలపై విద్యార్థులకు అవగాహన

### బాలలపై దుర్వినియోగాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పై దృష్టి

### బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ శోభారాణి

### బాల్యవివాహాలు అరికట్టడంలో చట్టాల ప్రాముఖ్యతపై అవగాహన

### పాఠశాల ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు

**నాగారం, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని పసునూరు గ్రామంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో బాలల చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మరియు జిసిఈసీ భాగంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో బాలలపై జరుగుతున్న వివిధ రకాల దుర్వినియోగాలు, వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు వంటి సమస్యలను అరికట్టేందుకు అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని రూపుదిద్దారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ శోభారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలల హక్కులు ప్రతి ఒక్కరికి సాహసిద్ధమైనవని, వాటిని ఎవరైనా హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాలలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులపై ప్రభుత్వం కఠినమైన చట్టాలను అమలు చేస్తున్నదని, ముఖ్యంగా బాలలపై లైంగిక దాడులను నిరోధించేందుకు ప్రత్యేక చట్టం అమల్లో ఉందని వివరించారు. ఏ చిన్న అనుమానాస్పద పరిస్థితి ఎదురైన భయపడ కుండా వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న ప్రస్తుత కాలంలో సైబర్ భద్రతపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మాధ్యమాల్లో అపరిచితులతో సంభాషణలు చేయకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఆన్లైన్ మోసాలు, సైబర్ వేధింపుల నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పిల్లల సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని, పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన సహాయ సేవలు ఎప్పుడు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బల్గూరి చంద్రబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంచడమే కాకుండా, తమ హక్కులను తెలుసుకొని స్వీయ రక్షణకు సిద్ధంగా ఉండేలా చేస్తుందని తెలిపారు. విద్య అనేది కేవలం పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించేదిగా ఉండాలని అన్నారు.

ప్రతి విద్యార్థి సురక్షిత వాతావరణంలో అభివృద్ధి చెందేందుకు పాఠశాల యాజమాన్యం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణపై ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ సేవలు ప్రతినిధి ఉమామహేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ స్టేడియంలో జరుగు అంబేద్కర్ జయంతి
# బహిరంగ సభను జయప్రదం చేయండి

**బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

**బాబాసాహెబ్ అంబేద్కర్ ఆధునిక భారత పితామహుడు**

**బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన కృషి అపారమైనది**

**బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు**



**నాగారం, అక్షిత న్యూస్:** మండల కేంద్రంలో మంగళవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ ఆదేశాల మేరకు బహుజన సమాజ్ పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ ఆధునిక భారతదేశ పితామహుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన సమస్త జీవితాన్ని బహుజన సమాజం కోసం అంకితం చేసిన మహానీయుడని కొనియాడారు. సమాజంలో అనగారిన బిసి, ఎస్సీ, ఎస్టి మరియు మైనార్టీ వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి అపారమైనదని తెలిపారు. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికి సమాన హక్కులు, స్వేచ్ఛలు అందించారని, ముఖ్యంగా మహిళల అభ్యున్నతి కోసం న్యాయశాఖ మంత్రి పదవిని సైతం త్యజించారని గుర్తు చేశారు. భారతదేశ ప్రజలకు ఓటు హక్కు కల్పించేందుకు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పోరాడి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేశారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల ఆధారంగా ఏర్పడిన బహుజన సమాజ్ పార్టీ, రాజ్యాంగమే తమ మేనిఫెస్టోగా భావించి అణగారిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. గ్రామపంచాయతీ మెట్లు కూడా ఎక్కని సామాన్యులను ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా తీర్చిదిద్దిన ఘనత పార్టీ వ్యవస్థాపకుడు కాన్సీరాం దని కొనియాడారు. ప్రస్తుతం బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి నాయకత్వంలో బిసి, ఎస్సీ, ఎస్టి మరియు మైనార్టీ వర్గాల హక్కుల కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఏప్రిల్ 14న జరిగే అంబేద్కర్ జయంతి భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి విద్యావంతులు, మేధావులు, రాజకీయ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ సభ్యుడు ఈదుల యాదగిరి, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి యాదగిరి, మధు, మద్దిరాల మండల అధ్యక్షులు ఉపేందర్, నూతనకల్ మండల అధ్యక్షులు కందుకూరి నరేంద్ర, రజక సంఘం మండల అధ్యక్షులు సోమన్న, అడ్డగూడూరు మండల అధ్యక్షులు వంశి తదితరులు పాల్గొన్నారు.





## ఎన్ ఫోర్స్మెంట్ విధులపై
# ప్రత్యేక దృష్టి పెట్టాలి

**వరంగల్ సిపి**

**వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం**

**-అక్రమ ఇసుక రవాణా గుట్కా విక్రయాలు, పేకాట, బెట్టింగ్‌లను ఎన్ ఫోర్స్మెంట్‌తో కట్టడి చేయాలి**

**-గంజాయిను విక్రయాల మూలలపై నజర్**

**వరంగల్, అక్షిత బ్యూరో:** కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా తో పాటు, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం, పేకాటను కట్టడి చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ ఫోర్స్మెంట్ ద్వారా నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాలలో ఎర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని,చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయా లని, అదే విధంగా ప్రజల భాగస్వామ్యంతో కాలనీలలో సిసి కెమెరా లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారి గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన ఆరైవ్ - ఆలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వినూత్న రీతిలో అవగహన కార్యక్రమాలు చేపట్టాలని, రాబోవు హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ముందస్తూ ప్రణాళికలతో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్,కవిత, జనగామ ఏ.ఎస్పీ చేతన్, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డిసిపిలు ప్రభాకర్, రవి, బాలస్వామి, శ్రీనివాస్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గోన్నారు.



# మహాలక్ష్మి పథకం చారిత్రక మైలురాయి

**నగర మేయర్ గుండు సుధారాణి,కలెక్టర్ డా.సత్య శారద**

**వరంగల్, అక్షిత బ్యూరో:**

మహాలక్ష్మి పథకం రాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారదతో కలిసి మేయర్ హాజరైనారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మార్చి నెల మహిళల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల మహిళలు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకుని, తమ ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకునే అవకాశం పొందుతున్నారని అన్నారు.

జిల్లా కలెక్టర్ డా.సత్య శారద మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10 వేల కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా కావడం ఒక విశేషమని అన్నారు. వరంగల్ జిల్లాలో సుమారు 6 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదై రూ.270 కోట్ల ఆదాఎ సాధించామని తెలిపారు. ఈ పథకం పట్ల మహిళల్లో పెరుగుతున్న స్పందనను టికెట్ల వినియోగం స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, డీఆర్‌ఓ విజయలక్ష్మి,డీఆర్‌డీఓ రామ్ రెడ్డి, డిపో మేనేజర్ ధరం సింగ్, అసిస్టెంట్ మేనేజర్ నజియా సుల్తానా, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా(సురేందర్ రెడ్డి)**

# జెఎస్ఆర్ నియామకం

**హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు**

**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి:**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ లో హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ బిజెపి నాయకులు, సామాజిక కార్యకర్త జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి( జెఎస్ఆర్) కు కీలక బాధ్యతలు వరించాయి. బిజెపి పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు తో పాటు బిజెపి అధిష్టానం సురేందర్ రెడ్డి కి మరోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అప్పగించిన రాష్ట్ర, కేంద్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో హుస్నాబాద్ నియోజక వర్గంలో పాటు, రాష్ట్రంలో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజల కోసం పనిచేస్తానని ధీమా వ్యక్తం చేశారు.



**హుస్నాబాద్ నియోజకవర్గంలో సంబరాలు:**

జన్నపరెడ్డి సురేందర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియామకం కావడం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు. హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి, వేసవిలో మంచి నీటి సరఫరాతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న జెఎస్ఆర్‌కు రాష్ట్ర పదవి రావడం గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు.




# నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని పత్రులు దగ్ధం:టీయుసిఐ

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** మేడే కార్మికులు తమ రక్తం చిందించి సాధించుకున్న కార్మికుల హక్కులను బిజెపి ప్రభుత్వం ఒక కలం పోటుతో రద్దు చేసిందని టియుసిఐ ఖమ్మం జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ అన్నారు. అనంతరం సింగరేణి క్వార్టర్సులో నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని జీవో ప్రతులు దగ్ధం చేయటం జరిగింది. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక రకాల చట్టాలను ఒక కలం పోటుతోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దు చేసింది అని ఈ చట్టాలను రాష్ట్రంలో అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయం అని అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నటువంటి నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటంలో భాగస్వాములు కావాలని కోరినారు. కార్మిక హక్కులను కాలరాస్తూ సమ్మెహక్కును జీతాల పెంపు దలను కాపాడే హక్కును రద్దు చేసే లేబర్ కోడ్స్ ఉపసంహరించు కోవాలని, మోడీ ప్రభుత్వం కార్మికుల పైన రైతుల పైన యుద్ధం ప్రకటించిందని హక్కుల కోసం పోరాటాలు చేయకుండా నీరుగార్చాలని ప్రయత్నం చేస్తుందని కార్పొరేట్ కంపెనీల పెట్టుబడుల ప్రయోజనాలకే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని అన్నారు. టి యు సి ఐ నాయకులు పవన్, కుమార్, రమేష్,మారేశ్వరి,నాగమణి,నాగేశ్వరావు తదితరులుకార్యక్రమంలో పాల్గొన్నారు.

# హెడ్‌కానిస్టేబుల్ పదవీ విరమణ

**పదవీ విరమణ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్‌ను ఘనంగా సన్మానించి, కో-ఆపరేటివ్ చెక్‌ను అందించిన జిల్లా ఎస్పీ నితిక పంత్**

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆత్రం అమృత రావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ , అమృత రావుకు శాలువా కప్పి సత్కరించి, బహుమతి అందించారు. పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీకి సంబందించిన పొదుపు రూపాయలు 2,68,568 విలువ గల చెక్ ను అందించారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజా యితీ, అంకితభావంతో సేవలందించి శాఖకు మంచి పేరు తీసుకు వచ్చినందుకు ఎస్పీ ఆయన సేవలను ప్రశంసించారు. విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. 1984 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్




కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి,నిరంతర కృషి, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ 2001 లో ఏఆర్ కానిస్టేబుల్ గా, 2011 సివిల్ కానిస్టేబుల్ గా కన్వర్షన్ లో చేరి, 2018 లో హెడ్ కానిస్టేబుల్‌గా, పదోన్నతి పొంది పెంచికల్పేట్ రెబ్బెన పోలీస్ స్టేషన్ల నందు పని చేశారు. 41 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలందించి, బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో సహచరులకు ఆదర్శంగా నిలిచారని ఎస్పీ గారు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని జిల్లా ఎస్పీ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్పీ చిత్ర రంజన్, ఆర్.ఐ (ఎం.టి.ఓ) అంజన్న, ఆర్.ఐ (స్పెషల్ పార్టీ) శ్రీనివాస్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయశంకర్ రెడ్డి , పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ ఇంచార్జ్ జాఫర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణానికి తీర్మాణం

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** కాగజ్ నగర్ పట్టణంలోని భట్టుపెల్లి చౌరస్తాకు సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేస్తూ మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మాణించింది. వార్డు నెంబర్ 6, 7ల పరిధిలో ఉన్న ఈ చౌరస్తాకు తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేయాలని వార్డు నెం. 17 కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్ కోరిన నేపథ్యంలో దీనికి నామకరణం చేస్తూ కౌన్సిల్ తీర్మాణించింది. కావేటి సమ్మయ్య విగ్రహాన్ని కూడా ఆ చౌరస్తాలో నెలకొల్పాలని పలువురు కౌన్సిలర్లు చేసిన సూచన మేరకు విగ్రహం ఏర్పాటుకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

**ఉద్యమకారునికి అసలైన గౌరవం దక్కింది: దండె విఠల్, ఎమ్మెల్సీ**

'మలి విడత తెలంగాణ ఉద్యమంలో కావేటి సమ్మయ్య పాత్ర ఎనలేనిది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సిర్పూరు నియోజకవర్గంలో ఆయన చేసిన ఉద్యమాలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాముఖ్యతను తెలిపాయ'ని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భట్టు పెల్లి చౌరస్తాకు కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో భాగంగా కావేటి సమ్మయ్య నల్ల టీ షర్టు ధరించి అసెంబ్లీ పైకి ఎక్కి చేసిన నిరసన రాష్ట్ర ఉద్యమాన్ని ప్రభావితం చేసిందన్నారు. అటువంటి ఉద్యమకారునికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం విలువ ఇవ్వలేదని, ప్రస్తుతం మా (కాంగ్రెస్) ప్రభుత్వం గుర్తించి ఆయనకు సముచిత గౌరవాన్ని కల్పించిం దన్నారు.



**కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు: కావేటి విజయ్ కుమార్, 17వ వార్డు కౌన్సిలర్**

తన తండ్రి కావేటి సమ్మయ్య పేరును భట్టుపెల్లి చౌరస్తాకు నామకరణం చేయడం సంతోషకరమని 17వ వార్డు కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్ అన్నారు. తన కోరికతో మంగళవారం జరిగిన సమావేశంలో దీనిని ఏకగ్రీవంగా ఆమోదించిన తోటి కౌన్సిలర్లకు, ఇందుకు సహకరించిన మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని కావేటి విజయ్ కుమార్ అన్నారు.

# ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ఈ రోజు 10వ డివిజన్ ఓల్డ్ పాలమూరులో నిర్వహించిన 99 రోజుల ప్రజ పాలన ప్రగతి ప్రణాళిక లో పాల్గొన్న కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడం, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు మరియు మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు మరియు ఆరోగ్య అవగాహన సేవలను ఒకే వేదికపై అందించడమే లక్ష్యం.

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆరోగ్య సేవలను ప్రజలందరికీ చేరవేయడం, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం అంతేకాకుండా, ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రోత్సహించడం, సమాజంలో ఆరోగ్య భద్రతను బలపరచడం ఈ కార్యక్రమం ద్వారా సాధించాలనేది ప్రభుత్వ సంకల్పం ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు రమేష్ బాబు, కిషన్ నాయక్, రఘు, మైత్రి యాదయ్య, ముఖ్య నాయకులు, నాయకులు, వైద్యులు, మరియు ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు

**రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ నియోజకవర్గశీలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మితమౌతున్న 2,160 ఇందిరమ్మ ఇళ్లను మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం హుజుర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని,అంతర్గత రోడ్లు, సభాస్థలిని,మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని,అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు.అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు,హౌసింగ్ పీడీ సిద్ధార్థ, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, తహసిల్దార్ కవిత,ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపాలిటీని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలి**

హుజుర్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని,అందుకు నూతన పాలక మండలి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌పై మంగళవారం హుజుర్ నగర్




మున్సిపాలిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు.హుజుర్ నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పారిశుద్ధ్యం,రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు.

రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆర్డీఓకు సూచించారు.వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# వస్తాకొండూర్‌లో ఘనంగా ముందస్తు బడిబాట కార్యక్రమం



**గుండాల/ అక్షిత న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వస్తాకొండూరు గ్రామంలో తేది 31 మంగళవారం రోజున 2026-27 విద్యా సంవత్సరానికి గాను ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూలకంటి నర్సిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలు ,అయిన మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయంవైపు పోవడం వల్ల పాఠశా లలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది కానీ ఇప్పుడు పాఠశాల లో ఉపాధ్యాయులు అందుబాటులో వచ్చారని కావున విద్యార్థులు వ్యయ ప్రయాసలు పడి దూర ప్రాంతాల పాఠశాలలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా మన గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాల కు రావాలని కోరారు. ఆ మేరగా గ్రామస్థులు, తల్లిదండ్రులు నిర్ణయం తీసుకొని పాఠశాలకు విద్యార్థులను పంపాలని కోరారు.ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపాల రాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల లో 3 సంవత్సరాల కే ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడం జరుగుతుంది దాని వలన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం జరుగుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం కూడ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ - ప్రైమరీ తరగతులను కొన్ని చోట్ల ప్రారంభించారు అదే విధంగా అన్ని పాఠశాలల్లో కూడా మొదలు చేసి 3 సంవత్సరాల కే విద్యార్థులను బడిలో చేర్చుకునే లా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆ దిశగా మన ఊరు లో కూడా ప్రీ- ప్రైమరీ ఎడ్యుకేషన్ విధానం అమలులోకి చేసుకొని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే లా వారి తల్లిదండ్రులను ప్రోత్సహించడం కోసం గ్రామ పెద్దలు అందరూ సహకరించాలని కోరారు

గ్రామ సర్పంచ్ లింగాల అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ వస్తాకొండూర్ గ్రామ పాఠశాలకు ఘనమైన చరిత్ర ఉందని చుట్టుపక్కల ఎన్నో గ్రామాల నుండి వందలది విద్యార్థులు వచ్చేవారని ఇప్పుడు పాఠశాల కనుమరుగు కాకుండా గ్రామ సర్పంచ్‌గా నా వంతు కృషి, చేసి మరల ఈ పాఠశాలకు గత వైభవం తీసుకు రావడానికి గ్రామ ప్రజా ప్రతినిధులు, అందరం కలిసి విద్యార్థులు తల్లిదండ్రులను ఒప్పించి మన బడికి పంపడం కోసం ఈ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు

ఉప సర్పంచ్ పరుశురాములు మాట్లాడుతూ ఈ ఊరిలోకి జనగామ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల బస్సులు వస్తున్నాయని వాటిని అడ్డుకుని మా గ్రామ విద్యార్థులను మా జిల్లాలోని మా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడానికి వారి తల్లిదండ్రులను కలిసి ఇతర జిల్లా లో చదవడం వలన రాబోయే జిల్లా స్థాయి ఉద్యోగ నియామకాలలో ఏర్పడే ఇబ్బందికర పరిస్థితుల ను వారికి తెలియజేస్తూ తప్పనిసరి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే దిశగా మేమంతా నడుము బిగించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ చైర్మన్, లింగాల బిక్షం గౌడ్ పాఠశాల ఉపాధ్యాయులు, దారా శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు పద్మ, రమ, రాజమణి, సునీత ,ఆశాకార్యకర్త రజిత , గ్రామస్తులు వీరమల్ల సోమన్న, రాజు, గనగాని వెంకన్న, సోమనారి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



## సీనియర్ జర్నలిస్టు ఉమా శంకర్ గౌడ్‌ను పరామర్శించిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్టు సంఘం నాయకులు

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కట్ట ఉమా శంకర్ గౌడ్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారు తన స్వగ్రామానికి చేరుకోవడంతో జర్నలిస్టు కట్ట ఉమా శంకర్ గౌడ్‌ని కొల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన టీయు డబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకులు వారి స్వగ్రామం సాతాపూర్‌లో మంగళవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేసి యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. జర్నలిస్టుగా సుదీర్ఘకాలం ఎన్నో సేవలు చేసి ఎంతోమందికి సహాయం చేసి నేడు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో విషయం తెలిసిన టీయుడబ్ల్యూజే ఐజేయూ జర్నలిస్టు యూనియన్ నాయకులు కట్ట ఉమాశంకర్ గౌడ్‌ని పరామర్శించి ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. జర్నలిస్టులందరం అండగా ఉంటామని హామీనిచ్చారు. త్వరగా కోలుకొని జర్నలిస్టు గా సేవలందించలన్నారు. తనను పరామర్శించెందు కోసం వచ్చిన జర్నలిస్టులను చూసి కట్ట ఉమా శంకర్ గౌడ్ కన్నీటి పర్యంత మయ్యారు. నాకోసం మీరంతా రావడం సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టుల కోసం పోరాడాలని ఆయన కోరారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యదర్శి రెసోజు సురేష్,కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మాలె.రాజేందర్ గౌడ్ కార్యదర్శి బొల్లం వెంకటస్వామి జిల్లా సహాయ కార్యదర్శి పి.వినోద్ కుమార్,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఈసీ మెంబెర్ వెంకటేశ్వర చారి,శేఖర్‌లు ఉన్నారు.

# పోలీస్ అక్క(నారిశక్తి)లతో జిల్లా ఎస్పీ సంబరాలు

### పోలీస్ అక్క నారిశక్తిలను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్



**నిర్మల్, అక్షిత ప్రతినిధి:**

నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న "పోలీస్ అక్క" (నారిశక్తి) కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డు లభించిన సందర్భంగా ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అక్క సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ హాజరై, పోలీస్ అక్క(నారి శక్తులతో) కలిసి సంబ రాల్లో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అందరు పోలీసు అక్క(నారిశక్తి)లకి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీస్ అక్కలు తమ అనుభవాలను సంతోషంగా వ్యక్త పరుచుకున్నారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి ఒకరికొకరు ఆనందాన్ని పంచుకున్నారు.

పోలీస్ అక్క(నారిశక్తి) కార్యక్రమం మహిళా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో నడిచే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం. ఇందులో భాగంగా బాలికలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, మహిళల భద్రత, సైబర్ సెక్యూరిటీ, పోక్సో చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో పెట్రోలింగ్, డయల్-100 ద్వారా అత్యవసర సేవలు అందిస్తూ మహిళలకు తక్షణ సహాయం చేస్తున్నారు.

పోలీస్ అక్కలు కేజీబీవీ పాఠశాలల్లో నెలకు ఒకసారి రాత్రి బస చేసి విద్యార్థినుల సమస్యలు విని, కౌన్సిలింగ్ అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 7,000 మంది విద్యార్థినులు, మహిళలు నేరుగా లాభపడి, తమ సమస్యలను భయపడకుండా చెప్పుకునే నమ్మకం పెరిగింది.మహిళల భద్రత, అవగాహన, సాధికారత కోసం ఈ కార్యక్రమం సమర్థవంతంగా పనిచేస్తూ సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతోంది.

ఈ సందర్భంగా పోలీస్ అక్క(నారి శక్తులు) జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, తమ సేవా అనుభవాలను పంచుకుంటూ, సమాజంలో మహిళలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. మహిళల భద్రత, అవగాహన, సాధికారత కోసం పోలీస్ అక్క కార్యక్రమం మరింత ప్రభావవంతంగా కొనసాగుతుందని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ మాట్లాడుతూ..

నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న లి"పోలీస్ అక్క"(నారి శక్తి) కార్యక్రమంలో భాగస్వాములైన మహిళా పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ అభినందించారు. మీ కృషి, నిబద్ధత వల్లే ఈరోజు ఈ కార్యక్రమం జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది స్కోచ్ అవార్డు అందుకున్నామని తెలిపారు.

విద్యార్థినులు భయపడకుండా తమ సమస్యలను పంచుకునే వాతావరణం ఏర్పడడం ఈ కార్యక్రమ విజయంగా పేర్కొన్నారు. ఈ అవార్డు గౌరవంతో పాటు బాధ్యతను కూడా పెంచిందని, ఇకపై మరింత మెరుగైన సేవలు అందిస్తూ ప్రతి బాలికకు భద్రత, నమ్మకం కల్పించడమే నిర్మల్ జిల్లా ప్రతి పోలీస్ అక్క(నారిశక్తి)ల లక్ష్యమని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు.

# హైదర్‌నగర్ అలీ తలాబ్ చెరువును సుందరీకరణ చేయాలి..

### హైదర్ నగర్ ఎంసిపిఐ (యు) పార్టీ కన్వీనర్ ఇక్రాన్ షేక్ ఆధ్వర్యంలో ఉప కమిషనర్‌కు వినతిపత్రం..

**శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి:** ఆల్విన్ కాలనీ సర్కిల్ హైదర్ నగర్ లో గల అలీ తలాబ్ చెరువును సుందరీకరణ చేయాలనీ ఆల్విన్ కాలనీసర్కిల్ ఉప కమిషనర్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2022లో శిలాఫలకం వేసి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదు మురుగునీరు చెరువులో కలవడం వలన చెరువు నిండా గుర్రపు డెక్క నిండిపోయింది. ఓ పక్క దుర్వాసనలను వెదజల్లుతుంది మరోపక్క దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో స్థానికంగా ఉన్న ప్రజలు అనారోగ్య సమస్యలకు పాలవుతున్నారని.. పక్కనే ఉన్న గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు, ప్రజలు డెంగ్యూ లాంటి ప్రాణాంతక




జ్వరాలతో ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని కమిషనర్‌కి వివరించడం జరిగింది. హైదర్ నగర్ అలీ తలాబ్ చెరువులో గుర్రపు డెక్క వెంటనే తొలగించి ప్రజలను ఆరోగ్యాలు అవకుండా కాపాడాలని, చెరువు సుందరీకరణ పనులను వెంటనే పూర్తిచేయాలని కోరగా సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యంసిపిఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లెమురళి, హైదర్ నగర్ డివిజన్ కన్వీనర్ ఇక్రాన్ షేక్, స్థానిక వాసులు అఫ్రోజ్, జహంగీర్ ముస్తఫా హాజరయ్యారు.



# దుర్గా దేవి పండగకు హాజరైన ఎమ్మెల్యే సామెల్

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:**
సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మండల పరిధిలోని రాఘవాపురం గ్రామం, జెత్యా నాయక్ తండ లో జరిగిన దుర్గమ్మ పండుగ సందర్భంగా ముఖ్య అతిదులుగా తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు పాల్గొన్నారు. ఈ పండుగ జాతీయ సంస్కృతికి, సామాజిక సౌహార్ధానికి సంబంధించి ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ సందర్బంగా వారు గ్రామస్తులకు దుర్గాదేవి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేవిని ఆరాధించడం ద్వారా అందరి జీవితాల్లో శాంతి, సఖ్యత ఉండాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మ పండుగ ఎలా జరుపుకోవాలో, దాని ప్రాధాన్యత, జనసామాన్యానికి ఇచ్చే సందేశంపై వారు ప్రసంగించారు. గ్రామస్తులు, స్థానిక ప్రజలు ఈ వేడుకలో పాల్గొని ఆనందంగా వేడుక జరిపారు. దుర్గాదేవి వేడుకల్లో గ్రామ సర్పంచ్ ధరావతు చిరంజీవి, మండల పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, జిల్లా నాయకులు సుంకరి జనార్దన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్మీ లాల్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు ధరావతు భీమా, మండల సర్పంచులు ధరావతు రామోజీ, భూక్య బిచ్చు నాయక్, బెట్టం రాజు, గుగులోతు ప్రేమ్ ప్రసాద్, ధరావతు రాజశేఖర్, కుమ్మం సతీష్ గౌడ్, లౌడియా బాలాజీ, కిషన్, నాగరాజు, లక్ష్మణ్ నాయక్, మండల నాయకులు గుగులోతు భాస్కర్ నాయక్, దాచేపల్లి శ్రీను, యాదగిరి, బానోతు కిష్ట నాయక్, గుగులోతు సుధాకర్, పిఎన్ఆర్ నరేష్, బానోతు భాస్కర్ నాయక్, ఎల్సోజు చంటి, నరేష్, సుందర్, శ్రీను ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుగ్గిళ్ళ దివ్యమూర్తికి విశ్వవిఖ్యాత మహోన్నత జాతీయ పురస్కారం

**-రవీంద్రభారతిలో మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా పురస్కారం**

**ఖమ్మం/అక్షిత బ్యూరో:**
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి మంగళవారం నాడు హైదరా బాదుల రవీంద్ర భారతిలో మంగళవారం నాడు మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా ఉగాది విశ్వవిఖ్యాత మహోన్నత జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో మనం ఫౌండేషన్



వారు దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. తదనంతరం గుగ్గిళ్ళ దివ్యమూర్తిని మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణు గోపాలచారి శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి మాట్లాడుతూ గుగ్గిళ్ళ దివ్యమూర్తి లాంటి ప్రతిభావంతులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ అవార్డు రావడం తనకు సంతోషంగా ఉందని మరియు సన్మానం జరగడం సంతోషంగా ఉందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 73 అవార్డులు వచ్చాయని 132 వేదికల మీద సన్మానం జరిగిందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ లక్ష్మీకాంతం కడపగాండ్ల చక్రవర్తి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞ శర్మ రిటైర్డ్ ఐఎస్ఎస్ ఆఫీసర్ ముదిగొండ జయశంకర్ శర్మ నారాయణరెడ్డి మున్నంగి గోపిరెడ్డి దీటి గోపాలకృష్ణయ్య లతా రెడ్డి సురభి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గొట్టిపర్తి వడ్డెర కాలనీలో సిసి రోడ్లు ప్రారంభం

**రూ.10 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం**

**ప్రతి కాలనీకి సమాన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం**

**గొట్టిపర్తి గ్రామ సర్పంచ్ చిలుకల మంజుల వెంకన్న**

**గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం**

**తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న (బిఎన్)**



**నాగారం, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ఆదేశాలతో వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్న నేపథ్యంలో వడ్డెర కాలనీలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సిసి రోడ్ల నిర్మాణానికి సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకల వెంకన్న చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించి శ్రీకారం చుట్టడం గ్రామ అభివృద్ధి చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న (బిఎన్) పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర కాలనీ నుండి ముదిరాజు పెద్దమ్మ గుడి వరకు నిర్మించబడుతున్న ఈ రహదారి, కాలనీ ప్రజల రాకపోకలకు మరింత సౌలభ్యాన్ని కల్పించడం ఉందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్ల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఎదుర్కొనే కష్టాలు, దురదలు మరియు మహిళల ప్రయాణంలో కలిగే ఇబ్బందులు ఇకనుంచి పూర్తిగా తగ్గుముఖం పడతాయని తన ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి అనేది ఒక్కరితో సాధ్యం కాదని, ప్రజలందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామంలోని ప్రతి కాలనీకి సమానంగా మౌలిక వసతులు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్లు, త్రాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధి ద్వారానే గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామ సర్పంచ్ చిలుకల మంజుల వెంకన్న మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అన్ని కాలనీలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, వడ్డెర కాలనీ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం అవడం సంతోషకర విషయం అని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అన్నెబోయిన శ్రీకాంత్, వార్డు మెంబర్ కోతి ఉమా యాకయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో భార్య, కుమారుడిని కొట్టి చంపిన భర్త

**ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న కూతురు ప్రణీత**

**సంఘటన స్థలాన్ని సందర్శించిన ఏసిపి జానకి రెడ్డి**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధి సీతారాం నగర్ తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని పులి గోని పల్లి తండాలో కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తలు గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న భర్త సభావట్ రాందాస్ భార్య కవిత (29) కుమారుడు హర్షవర్ధన్ (5) కూతురు ప్రణీత (9) లను రోకలితో భార్య నెత్తిపై



బలంగా మొదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న కుమారుడు హర్షిత్ పై దాడి చేయగా అతను మృతి చెందాడు. కూతురు ప్రణీతపై కూడా దాడి చేయడంతో ఆమె ప్రాణాపాయ స్థితిలో హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీనికి సంబంధించి తాండ గిరిజనులు ఎసిపి జానకి రెడ్డి, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పులిగోనిపల్లి తండా కు చెందిన రాందాస్‌కు భార్య కవితతో పాటు ముగ్గురు కూతుర్లు పవిత్ర, పావని, ప్రణీత కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. గత పది సంవత్సరాల నుండి భర్త మద్యానికి బానిసై తరచు భార్య పిల్లలతో



గొడవపడేవాడు కుటుంబ సభ్యులు ఇరుగు పొరుగువారు వచ్చి వారిని సముదాయించి కాపురం మంచిగా చేసుకోవాలని హితబోధ చేసేవారు. గతంలో పోలీస్ స్టేషన్లో కూడా భర్తపై కవిత ఫిర్యాదు కూడా చేసింది.. పోలీసులు మంచిగా కుటుంబ సభ్యులతో కలిసి బతకాలని నచ్చజెప్పి పంపించేవారు. రాందాస్ తన ప్రవర్తన మార్చుకోకుండా అటు పిల్లలను భార్యను వేధిస్తుండేవాడని వారు తెలిపారు. చివరకు భార్య పిల్లలను అంతమొందించినట్లు వారు తెలిపారు. ఆమనగల్లు సూర్యలక్ష్మి కాటన్ మిల్ లో పనిచేస్తున్న రాందాస్ రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడని తెల్లవారు జామున ఇరుగు పొరుగు వారు చూసేసరికి భార్య కుమారుడు చనిపోయి ఉన్నాడని కొన ఊపిరితో ఉన్న కూతురిని స్థానిక పోలీసుల సహకారంతో హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీమ్ తో పాటు మహేశ్వరం ఏసిపి జానకి రెడ్డి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, జానకిరామ్ రెడ్డి, గంగాధర్ ఎస్సై సీతారాం రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి శవ పంచనామా నిర్వహించారు. మృతుల సమీపంలో ఉన్న వస్తువులను సేకరించారు. రాందాస్ భార్య కూతురు కుమారుడిని కొట్టిన రోకలి, అక్కడే పడి ఉన్న కత్తినీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్ష పడే విధంగా ఆధారాలు సేకరిస్తామని ఏసిపి తెలిపారు. ఈ హత్యలు ఇంకా ఎవరైనా పాల్గొన్నారా అనే కోణంలో దర్యాప్తు జరుపుతామని ఏసీపి జానకి రెడ్డి తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యం

**-ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్**




**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడోవ విడత అరైవ్...అలైవ్ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. అందులో భాగంగా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్పంచులు ఆటో యూనియన్ మార్కెట్ యూనియన్లు విద్యార్థులు స్థానిక ప్రజలతో శ్రీకర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రోజురోజుకి పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్మాత్మకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రముఖులు మీడియా ప్రజాప్రతినిధులు అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం మద్యం సేవించి నడపడం సిగ్నల్ జంప్ స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్ ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి పెట్టామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానా విధించడం తిరిగి తప్పిదాలు జరగకుండా జాగ్రత్త తీసుకుంటారని ఉద్దేశ్యమేనని అన్నారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత జిల్లాగా నిర్మించేందుకు సమావేశానికి వచ్చిన అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టంగా స్పష్టం చేశారు.

ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి ప్రభుత్వం రహవీర్‌గా గుర్తించి నగదుతో ప్రోత్సాహిస్తుందని పోలీసులు గౌరవం అందిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్డు ప్రమాదాల జరగకుండా వేగం నియంత్రణ సూచిక బోర్డులను పోలీస్ కమిషనర్ స్వయంగా ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏసిపి తిరుపతిరెడ్డి ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను ఆహ్వానించిన ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకులు

**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఏప్రిల్ 5న ఆదివారం రోజు ఉదయం 10:30 కు ఖమ్మం బైపాస్ రోడ్డు రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ గొర్రెల పెంపకం దారుల సంఘం నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లా యాదవ కురుమ ప్రజాప్రతినిధుల ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సన్మాన సభకు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ మంగళవారం నాడు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను కలిసి ఆహ్వానించారు.

ఇలాంటి కార్యక్రమం చేపట్టిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులను అభినందిస్తూ యాదవ కురుమల కోసం చేసే ఎలాంటి మంచి కార్యక్రమానికైనా ఎప్పుడు పిలిచినా వస్తానని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తెలిపినట్లుగా మేకల మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తురక గూడెం సర్పంచ్ బుర్ర కృష్ణ బాలిన శ్రీశైలం చిలకల వెంకటేశ్వర్లు రాజు యాదవ్ ఊరుబెండి వెంకటేష్ యాదవ్ కన్నెబోయిన సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల ఏర్పాట్లు పూర్తి చేయాలి

**-కలెక్టర్ పీ.ప్రావీణ్య ఆదేశం**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి నిర్వహించనున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో గ్రామసభల నిర్వహణపై ఆమె సమీక్షించారు. గ్రామసభలు ఉదయం 10 గంటలకు ప్రారంభించి, లబ్ధిదారుల ఎంపిక వివరాలు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, రేషన్ కార్డులు, చేయూత, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఉపాధి హామీ వంటి పథకాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా, ఇంట ర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం వంటి కొత్త పథకాల వివరాలు కూడా తెలియజేయాలని చెప్పారు. మహిళలు, వృద్ధులకు సౌకర్యాలు కల్పించి, గ్రామసభల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. లబ్ధిదారుల జాబితాలు సిద్ధంగా ఉంచి, కొత్త దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అధికారులు గ్రామసభలకు హాజరై పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం

**- కలెక్టర్ పరిశీలన**

**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** జిల్లాలో విద్యా, శిశు సంక్షేమ సేవల అమలును పరిశీలించేందుకు కలెక్టర్ ప్రావీణ్య కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక వసతులు, సేవల నాణ్యతను సమీక్షించారు. పాఠశాలలో తరగతి గదులు, పరిశుభ్రత, త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం



నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు గుడ్డు సహా పౌష్టికాహారం అందుతున్నదా అని పరిశీలించి, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మోనిన్ పరిశ్రమను సందర్శించి భద్రతా చర్యలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సాగు, సరఫరా మరియు విక్రయానికి పాల్పడిన 5 గురు నిందితులకు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

**- రూ.10,000 జరిమానా విధింపు**

**కీలక తీర్పు వెలువరించిన 1వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి శ్రీ నారాయణ**

**జగిత్యాల, అక్షిత బ్యూరో:** గంజాయి సాగు, సరఫరా మరియు విక్రయ కార్యకలాపాలకు పాల్పడిన ఐదుగురు నిందితులకు గౌరవ న్యాయస్థానం కఠిన శిక్షను విధించింది. ఈ కేసులో నిందితులపై నమోదైన సాక్ష్యాధారాలను సమగ్రంగా పరిశీలించిన జిల్లా 1వ అదనపు జిల్లా ఒ సెషన్స్ జడ్జి శ్రీ ఎస్. నారాయణ నిందితులందరినీ దోషులుగా నిర్ధారించి ఒక్కొక్కరికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కేసు వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు సోయాం రాజు అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో తన పత్తి చేనులో గంజాయి మొక్కలు సాగు చేస్తూ, అవసరమైన వారికి ఫోన్ ద్వారా సంప్రదించి స్వయంగా గంజాయి సరఫరా చేసేవాడు. మిగతా నిందితులు ఆయనకు స్నేహితులు కాగా, చెడు అలవాట్లకు బానిసై గంజాయి వినియోగం చేసేవారు. వీరు తరచుగా సోయం రాజు నుండి గంజాయి కొనుగోలు చేసేవారు.

తేదీ 23-12-2022 న, నిందితులు ధరూర్ కు చెందిన పాల రాజ్ కుమార్, జగిత్యాల కు చెందినబొమ్మిడి సాయిచంద్, ధరూర్‌కు చెందిన బాల నరేష్, కొలుగూరి సాయి సృజన్ గంజాయి కోసం రాజును సంప్రదించగా, నూకపల్లి డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతానికి రావాలని సూచించారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద సుమారు 1.25 కిలోల (1250 గ్రాములు) ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పంచనామా నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను గౌరవ న్యాయస్థానంలో దాఖలు చేశారు. విచారణ అనంతరం న్యాయస్థానం శిక్ష విధించింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల సాగు, సరఫరా, రవాణా మరియు విక్రయం చట్టవిరుద్ధమేకాక సమాజానికి తీవ్రమైన హానిని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన మల్యాల ఎస్.ఐ చిరంజీవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్యా, సి.ఎం.ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ హరీష్, సి.ఎం.ఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా మహావీర్ జయంతి

**అసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** జైన్ సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మహావీర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు జైన్ మందిర్ నుంచి గాంధీ చౌక్ వివేకానంద చౌక్ అంబేద్కర్ చౌక్లమీదుగా మహావీరుని చిత్రపటంతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన చేపట్టారు మహిళల భజనలతో, చిన్నారుల నృత్యాలతో ప్రదర్శన కొనసాగింది ఈ కార్యక్రమంలో జైన్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

